# గాలివాన

గజపతిరావుగారు కిటికీ వద్ద నిల్చున్నారు. ఆయన దృష్టి దూరంగా కనిపిస్తున్న మట్టి రోడ్డుపై ఉంది. రాత్రంతా ఉండపోతగా వర్షం కురిసింది. వాన తగ్గినా ఆ ఛాయలు పూర్తిగా పోలేదు. నల్లటి మేఘాలతో నిండిన ఆకాశం, రివ్వున వీస్తున్న చల్లగాలి, వానరాకని హెచ్చరిస్తున్నట్లున్నాయి. వాననీటిలో తడిసిన మట్టిరోడ్లు చితచితలాడుతున్నాయి.

ఆయన దృష్టిని రోడ్డుపైనుంచి తప్పించి గదిలోకి చూశారు. అంతా నిశ్శబ్దం– భరించలేని శాపంలాంటి నిశ్శబ్దం అది నాలుగు గదుల ఇల్లు. కానీ ఆ నాలుగ్గదుల్లో నివసించేది ఆయనొక్కడే. అందువల్లనే ఇల్లంతా భోరుమంటూ భయపెడుతోంది. అక్కణ్ణించి కదిలి గది మధ్యగా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

గజపతిరావుగారు, ఆరడుగుల మనిషి ఆయన్ని చూసినవాళ్ళకి ధైర్యం కలిగించేలా ఉంటారు. ఇలాంటి తండ్రో అన్నయ్యో ఉంటే బాగుండుననిపించేలా ఉంటారు. అంతటి పులిలాంటి మనిషి ఆరోజు రోగిష్టివాడిలా, నీరసంగా, నిస్సత్తువగా, అలసటగా ఉన్నారు. నిజానికి ఆయనకున్నది ఒక్కటే జబ్బు, మందుల్లేని జబ్బు ఒంటరి తనం జీవితపు రహదారి వెంట తోడులేని పయాణం.

ఆయనకు ఆలోచించేందుకు, కలతపడేందుకు ఇంకే సమస్యలంటూ లేవు. ఆడపిల్లలిద్దరికీ మంచి సంబంధాలు చూసి ఘనంగానే పెళ్ళిళ్ళు చేశారు. వాళ్ళిద్దరు హాయిగా కాపురాలు చేసుకుంటున్నారు. వాళ్ళెంతహాయిగా సంతోషంగా ఉన్నారంటే భర్తల నొదిలి ఒక్క క్షణంకూడా ఉండలేరు. అందువల్లే తండ్రిని చూడ్డానికీ కూడా

అరుదుగా వస్తుంటారు. ఇక ఒక్కగానొక్క కొడుకు హైదరాబాద్‌లో ఇంజనీర్. అతడి జీవితం అందమైన పూలరథం.

ముగ్గురు పిల్లలు మూడు వైపులా విసిరేసిన పూలగుత్తుల్లా పచ్చగా హాయిగా బ్రతుకుతున్నారు. పిల్లలపరంగా జీవితాన్ని గూర్చి ఆలోచిస్తే అదృష్టవంతుడినన్న ఆత్మ సంతృప్తి కలుగుతుంది. కానీ ఆలోచనల్ని తనవైపు తిప్పుకుని తనపరంగా ఆలోచించుకుంటే తానెంతటి నిర్భాగ్యుడ, దురదృష్టవంతుడోననిపిస్తుంది. దానిక్కారణం ఆర్థికమైనది కాదు. ఉండడానికి సొంత ఇల్లు, నెలనెలా చేతిలో వచ్చిపడే ఫించను ఇవన్నీకాక తనంటే అభిమానించే ఊరి ప్రజలు...

గజపతిరావుగారికి ఉద్యోగంలోంచి రిటైర్ కాకముందే భార్య మహాలక్ష్మి చనిపోయింది. ఏ వయసులో మనిషికి తోడు అవసరమో, ఏ వయసులో మగవాడికి అనునయం, ఆప్యాయత, ఆదరణ, అనురాగం అనే పదాలకు సరైన అర్థం తెలుసుకుని వాటినన్నిటినీ అనుభవించి, అర్థశరీరం చేత అనుభవింపచేస్తుంటాడో, ఏ వయసులో భార్య విలువ భర్తకి నిజంగాస్పష్టమవుతుందో– ఆ వయసులో ఆయన భార్యపోయింది. భార్యపోయిందన్న బాధ ఒకవైపు– ఆమెను తనే చంపాడన్న అపవాదు మరొకవైపు ఆయన్ని కృంగదీసినాయి. విచిత్రంగా ఏ ఒక్కరూ ఆయనముందుకు వచ్చి మహాలక్ష్మమ్మగారెలాపోయారని అడగరు. ఈకారణంగా ఆమె పోయిందని ఆయన చెప్పరు. కానీ ఆయనకు తెలుసు తనముందు ఆప్యాయంగా నవ్వినవాళ్ళే వెనక హంతకుడ్ని చూసినట్టు గుచ్చి గుచ్చి చూస్తున్నారని.

కొన్ని భావాలు కొంత మందితో ఎలా పుడతాయో అవి ఎలా ప్రచారం పొందుతాయో చెప్పడం కష్టం. అవి చాలా సందర్భాల్లో అబద్ధాలు కావచ్చు, కానీ కొన్ని సందర్భాల్లో నిజాలయ్యే ప్రమాదం కూడా ఉంది. సరిగ్గా ఆ ఊర్లో అలానే జరిగింది. మహాలక్ష్మి, గజపతిరావులనడుమ ఏదో భయంకరమైన అసంతృప్తి ఉందని, వాళ్ళ దాంపత్య జీవితం శృతితప్పిందన్న ఒక భావన ఆ ఊళ్ళో ప్రచారం కాసాగింది. అందం అనే పదం మగవాడికి వర్తించదు. అందులో గజపతిరావుకు అసలు వర్తించదు. ఎందువల్లనంటే అది మహాలక్ష్మి సొత్తుగనుక. ఆమె ఎర్రగా ఉండేది. ఎత్తుగా రథంలా ఉండేది. చక్రాల్లాంటి కళ్ళు, మైదానం లాంటి నుదురు, దానిపైన సూర్యబింబంలాంటి కుంకుమ, ఆమె నవ్వుతున్నప్పుడు అదొక అందం, నవ్వకుండా బిగదీసుకుంటే మరొక అందం. ఆడదానికి మాంసముద్దలు ఎక్కడ పుష్కలంగా ఉండాలో ఎక్కెడెక్కడ తక్కువగా ఉండాలో బాగా ఆలోచించి ప్రకృతి ఆమెను తయారు చేసినట్టు అందానికి, ఆకర్షణకి నిర్వచనంలా ఉండేది. పుత్తడి బొమ్మలాంటి ఆమె ముందు గజపతిరావు కంచు విగ్రహంలా ఉండేవాడు. బహుశా వాళ్ళిద్దర్ని పోల్చి చూశాకే ఆ ఊళ్ళో జనం అంత అందగత్తె భర్తకి తప్పకుండా ఆమెపై అనుమానం ఉంటుందన్న అనుమానం వాళ్ళ దాంపత్యజీవితంలో ఏదో అసంతృప్తి ఉందన్న ధైర్యంతో గాలి కబురు పుట్టించి ఉంటారు. ఆ గాలి కబురుకీ ప్రాణంపోసింది ఆమె ఆకస్మికమైన చావు.

గజపతిరావు గారు కదిలి పక్కగదిలోకి వెళ్ళాడు గోడకు వేళ్ళాడుతున్న భార్య ఫోటోవంక తదేకంగా చూస్తూ అలానే నుంచుండిపోయారు. మహాలక్ష్మికి అందగత్తెనన్న అహం ఎక్కువగా ఉండేది. తన శరీరాలంకరణకు తీసుకునే శ్రద్ధాకాలంలో పదోవంతైనా పిల్లల పట్ల చూపించేదికాదు. అది గజపతిరావుకు ఇష్టం ఉండేది కాదు. ఒక వయస్సు వచ్చాక ఆడ మగ ఇద్దరూ గౌరవప్రదమైన తరహాని, అలవాట్లను అలవర్చు కోవాలన్నది ఆయన సిద్ధాంతం. ఆ విషయాన్ని భార్యతో ఎన్నోసార్లు అనేక సందర్భాల్లో చెప్పిచూశారు. కానీ ఆమె తేలిగ్గా కొట్టిపారేసేది. అప్పట్లో మూడే గదులుండేవి. భార్య పోయాక, పెద్దపిల్ల పెళ్ళికి నాలుగోగది కట్టించారు. ఒక గదిలో తాను పడుకునేవాడు. పక్కగదిలో ఊహ తెలిసిన పిల్లలు కానీ మహాలక్ష్మి అవేమీపట్టనట్లు భోజనాలుకాగానే భర్త గదిలోకి వచ్చి భళ్ళున తలుపు గడియపెట్టేది. గజపతిరావుకి ఆ పని చాలా అసౌకర్యంగా ఉండేది. ఆ విషయాలన్నింటిని తలుచుకుంటే ఇప్పటికీ ఆశ్చర్యమనిపిస్తుంది. మహాలక్ష్మికి కామపరమైన కోర్కెలు ఎక్కువగా ఉండేవి. దాదాపు 15 సంవత్సరాలకు పైగా సంసార జీవితం గడిపి ముగ్గురు పిల్లల తల్లి అయ్యాక కూడా ఆమె ఆవిధంగా ప్రవర్తించడం ఆయనకు అసహ్యంగా, జుగుప్స కలిగించే విధంగా ఉండేది. బహుశా దీనికి కారణం ఆమె శారీరక స్థితేకాక అంతర్గతంగా ద్విగుణీకృతమైన కాంప్లెక్స్- అందగత్తెనన్న అహంభావం కావచ్చు.

చల్లగాలి రివ్వుమంటూ రొదపెట్టుకుంటూ వీస్తోంది. ఆయన వెళ్ళి కిటికీ తలుపులు మూసేసి మళ్ళీ వచ్చి భార్య ఫోటోకు ఎదురుగా ఉన్న మంచంపై

కూర్చున్నారు. ఆలోచనలకు ఆనకట్టవేయలేని ఆయన అసమర్థతను గమనించినట్టు అవి మళ్ళీ విశృంఖలంగా వెనక్కు పరిగెడుతున్నాయి.

ఆరోజు రాత్రి.... తన దాంపత్యపు జీవితానికి చివరి రాత్రి... కాళరాత్రి. భోజనం పూర్తిచేసి ఆయన ఇంగ్లీషు పేపరు చదువుకుంటూ పడుకున్నారు. కాసేపటికి యధావిధిగా మహాలక్ష్మి లోనికి వచ్చి తలుపు గడియపెట్టింది. వెంటనే చకచకా చీరెను విడిచేసి హేంగర్ పై పడేసి అతడిపక్కన చేరి ఛాతి పైన తన పక్కకు తిప్పుకోవాలని ప్రయత్నించింది. కానీ ఆయన విసుక్కుంటూ మరోవైపు తిరగబోయాడు. కానీ ఆమె ప్రయత్నాన్ని వారిస్తూ ఆయన ముఖాన్ని రెండు చేతులతో పట్టుకుని తనవైపుగా తిప్పుకుంది.

ఆమె చూపుల్లో ఎర్రెఎర్రెగా కాలుతున్న కోర్కె..... 'కాసేపు ఏదైనా కబుర్లు చెప్పండి' అంది. ఆయన ఆమె వంక ఎంత అసహ్యంగా చూడొచ్చో అంతలా చూశాడు. పక్క గదిలో పిల్లలు ఏదో విషయం చెప్పుకుని పెద్దగా నవ్వుకుంటున్నారు. 'నిద్ర రావటంలేదండి' గోముగా అంది మళ్ళీ.

'నిద్రెలా వస్తుంది వొళ్ళంతా కొవ్వెక్కి చిందులు తొక్కుతుంటేను. నిద్రరాకపోతే ఇదిగో ఈ మాత్రలు మింగి పడుకో వెళ్ళవతలకి. ముఖం నాకు చూపించకు' అంటూ దిండు కింద ఉన్న నిద్రమాత్రల సీసాను ఆమెపైకి విసిరేశాడు.

ఆయనకు గత ఏడాదిగా తరచూ కడుపునొప్పి రావటం మొదలైంది. అది ఏ సమయంలో వస్తుందో తెలియదు. కాని వచ్చినప్పుడు పేగులు మెలితిప్పే బాధ. ప్రాణాలు పోతాయేమోననే భయం. డాక్టర్‌ను సంప్రదించగా ఆవిధంగా నొప్పి వచ్చినప్పుడు ఒక క్యాప్సిల్, ఒక నిద్రమాత్ర వేసుకోమని సలహా ఇచ్చాడు. అప్పటినుంచి నిద్రమాత్రలు సీసా ఎప్పుడూ ఆయనకుఅందుబాటులో ఉంటుంది.

భర్త మాటలు విన్నాకా ఆమె మొహంలో బాధ సుడులు తిరిగింది. ఛెళ్ళున కొరడాపెట్టి చరిచినట్లు.... ఆమెలో చెలరేగిన భావ సంఘర్షణ అటువైపు తిరిగి పడుకున్న ఆయనకు తెలియదు. కాసేపటికి నిద్రలోకి జారిపోయాడు కానీ ఒక రాత్రివేళ ఛటుక్కున మెళుకువ వచ్చింది. ఎందుకీలా ఆకస్మాత్తుగా మెలకువ వచ్చింది. ఏమైంది?

బయట ప్రశాంతంగా ఉంది. గుడ్డి వెన్నెల మసకమసకగా మంచంపై పడేతోంది. దూరాన్న ఎక్కడో కుక్క వికృతంగా ఏడుస్తోంది.

తనకెందుకు మెలుకువవచ్చిందా అని చీకట్లో పడుకుని ఆలోచిస్తున్న గజపతిరావు చెంపను ఒక మంచుముక్కలాంటి చెయ్యి నిమరటం వెంటనే అతనికి సమీపంలో తన పక్కనే భయంకరమైన మూలుగు వినపడటంతో ఉలిక్కిపడి ఒక్క ఉదుటున లేచి లైటు వేశాడు.

మహాలక్ష్మి మరోలోకానికి వెళ్ళడానికి సిద్దంగా ఉంది. ఆమె ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. నాలుక భయంకరంగా

కొద్దిగా బయటకు వచ్చి పక్కలనుంచి నురగలు. తన కిష్టమైన పెళ్ళినాటి పట్టుచీర కట్టుకుంది.

ఆమెనలా చూశాక ఏమి చేయాలో కాసేపు అర్ధంకాలేదాయనకి. అర్ధమయ్యేసరికి దుఃఖం పొర్లుకొచ్చింది. 'లక్ష్మీ ఏమిటిది? ఏమైంది? అంటూ ఆమెను చేతిలోకి తీపుకున్నారు. ఆమె ఏదో చెప్పాలని విశ్వప్రయత్నం చేస్తోంది. పెదవులు అస్పష్టంగా కదులుతున్నాయి కాని మాట బయటకు రావటంలేదు.

ఆయన పసిపిల్లవాడిలా ఏడుస్తున్నాడు. కాలంమించిపోతోంది. ఆ విషయం ఆయనకు తట్టలేదుగాని ఆమె గ్రహించింది. అందుకే చెవిదగ్గర అతికష్టంమీద రెండు మాటలు గొణిగింది. 'మీరంటే ఇష్టం... మీరూ, పిల్లలూ, పిల్లలూ...' అంతే. ఖాళీ నిద్రమాత్రల సీసా చూశాక ఏమి జరిగిందో అర్ధమైంది. మహాలక్ష్మి మట్టిలో కలిసిపోయింది. 'లక్ష్మి నేనేమన్నాను? నాకెంతటి శిక్షను విధించావు? పిల్లల ముందు అసభ్యంగా ప్రవర్తించవద్దన్నానన్న చిన్నమాటకు ఇంతటి శిక్షా? జలగాల్లాంటి జనానికి నన్నప్పగించి నువ్వు తప్పుకున్నావా?'

భార్య తాలూకు ఆలోచనలు రావటంతో ఆయనకు కళ్ళు చెమ్మగిల్లాయి. భార్య పోయిందన్న బాధ ఇంకోవైపు వెర్రిగా, భయంగా, దీనంగా చూసే పిల్లలు. చిత్రమైన క్షోభ అనుభవించారు. చెప్పుకోలేని బాధ, చెప్పుకుందామన్నా ఎవరూ లేరన్న బాధ... విచిత్రంగా భార్య పోయాక కూడా భోజనాలయ్యాక గదిలోకి వెళ్ళి తలుపు వేసుకునేవాడు. కానీ లోపల తండ్రి ఏంచేస్తాడో పిల్లలకు తెలియదు. తన బాధను తనలోనే దిగమింగుకుని భార్య తనకప్పజెప్పి వెళ్ళిన బాధ్యతలను నెరవేర్చాడు. పిల్లలు ముగ్గరికి చదువులు చెప్పించారు. మంచి సంబంధాలు

చూసి పెళ్ళిళ్ళు చేశారు. మనిషి ఈ ప్రపంచంలో హాయిగా, సంతోషంగా బతకటానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేశాడు.

వాళ్లకి రెక్కలొచ్చాయి. పచ్చటి జీవితం చేతులచాచి ఆహ్వానించగా ఎవరి మార్గంలో వాళ్ళు వెళ్ళిపోయారు. అప్పటినుంచి అదేమిటో భార్య లేదన్నది అధికంగా ఉంటోంది. ఎప్పుడూ ఆమెగురించే ఆలోచనలు. నాలుగు గోడల మధ్య బందీగా బతుకుతున్నారు. ఓపికుంటే ఒండుకోవడం, ఆకలైతే తినడం, భార్య ఫోటోముందర నుంచోడం.

'మహాలక్ష్మి నిన్ను నేను చంపానా? ఊళ్ళో అలా అంటున్నారు.'

కొన్ని సంవత్సరాలుగా ఒంటరి జీవితంతో విజ్ఞతని పోగొట్టుకున్న ఆలోచనలు. వెర్రిగా ఆయనచేత జీవంలేని భార్య ఫోటోనే అడిగించేవి. ఆయన తనివి తీరని కళ్ళకి ఆ ఫోటోకి ప్రాణం వచ్చినట్లు ఆమె పెదవి విప్పి అబ్బే అదేమిటి నేనేగా చనిపోయింది, అసలైన ఇంకా మీలో నేను బతికున్నానని వాళ్ళకేమి తెలుసు' అని చెప్తున్నట్లు అనిపించేది. మనశ్శాంతికోసం మనిషిపడే ఆరాటం, అబద్దపు నీడల్లో దాన్ని పొందాలనే తాపత్రయం.

గత రాత్రి వర్షం దారుణంగా కురిసింది ఆకాశానికి చిల్లులు పడినట్లు, పాపభూయిష్టమైన భూమిని కనిపించని శక్తి అమృతజలంతో కడిగి తిరిగి పునీతురాలిని చేస్తున్నట్లు ఏకధారగా కురిసింది. అంతగా వర్షం కురుస్తున్నా గజపతిరావు తనకేమీ పట్టనట్లు తన మిథ్యాప్రపంచంలో తాను ఉన్నాడు. ప్రతిరోజూ స్మరించే ప్రశ్నవెనుకే వచ్చే జవాబు రాలేదు. మళ్ళీ మళ్ళీ ప్రశ్నించుకున్నాడు. నిశ్శబ్దం. మొహంలో ఆందోళన గుండెల్లో నిశ్శబ్దం. దూరాన్నెక్కడో పిడుగుపడింది. ఆకాశం ఉరిమింది. ప్రశ్నేగాని జవాబురాని ఆ పరిస్థితినుంచి తప్పించుకోవాలనుకుంటున్నట్లు లేచి కిటికీ వద్దకు వచ్చి నించున్నారు. ఉండి ఉండి ప్రకాశవంతమౌతూ తిరిగి చీకట్లో మునిగిపోతున్న, ఆకాశంవంక చూస్తున్న ఆయన బుర్రలోకి ఒక ప్రశ్న చొరబడింది. 'ఏమిటి తన పరిస్థితి, ఎవ్వరికీ అవసరంలేని తాను ఎందుకు బతికున్నట్లు'. చావనే రైలుబండి కోసం ఎదురుచూస్తూ కూర్చునే కన్నా తానే దాన్ని వెతుక్కుంటూ వెడితే.

ఆ ఆలోచన పుట్టించే తడవుగా దాన్ని సమర్ధిస్తున్నట్లు ఎన్నో సమాధానాలు వచ్చాయి.

కొంతకాలం క్రితం కొడుకుదగ్గర ఉండొద్దామని వెళ్ళిన మాట వాస్తవమే. కాని అక్కడ ఎదురైన పరిస్థితి ఏమిటి? వెళ్ళిన రెండు రోజులు కొడుకూ కోడలూ బాగానే ఉన్నారు. కాని ఆ తరువాత వాళ్ళలో ఏదో విచిత్రమైన మార్పు. వాళ్ళ ఆనందానికి, సుఖశాంతులకు తాను అడ్డువస్తున్నట్లు. ఆకాశంలో హాయిగా ఎగిరిపోవానుకుంటున్న వాళ్ళ కాళ్ళకు తాను పెద్ద గుదిబండలా బాధ్యత ఉన్న కొడుక్కే తాను బరువైనప్పుడు ఇంకా ఆడపిల్లగురించి ఆలోచించడం అవివేకం తిరుగు ప్రయాణంలో ఆయన గట్టిగా అనుకున్నడు ఇంక ఎవరికి తాను అడ్డు, బరువూ కాకూడదు. ఏ జన్మలో ఎవరి అన్యోన్యతకి అంతరాయం కలిగించానో

ఇప్పుడి శాపంలాంటి ఏకాకి బతుకు. మళ్ళీ అదే తప్పా? కాబట్టి తన అవసరం పిల్లలకి లేదు. భార్య ఎలాగూ లేదు. మరి ఎవ్వరికోసం బతకటం తనూ హాయిగా మహాలక్ష్మిలా–

ఆ ఆలోచనలకు బలం చేకూరడంతో అదేమిటో విచిత్రంగా కొత్త శక్తి ఉత్సాహం తనలోకి ప్రవేశించినట్లనిపించింది. ఆజన్మాంతపు ఖైదీకి తెల్లవారి విడుదల చేస్తున్నామని చెప్పినప్పుడు కలిగే ఆనందపు అలజడి...

వెంటనే కర్తవ్యం స్ఫురించింది– బయట జల్లుజల్లుగా వర్షం కురుస్తునే ఉంది. కాగితాలనీ, పెన్నునీ చేతిలోకి తీసుకుని ముగ్గురి పిల్లలకూ వేరు వేరుగా ఉత్తరాలు రాయనారంభించారు. వాటిల్లో అన్ని విషయాలూ నిర్భయంగా, నిర్మొహమాటంగా విపులంగా రాశారు.

తల్లి మరణం వెనుక ఉన్న అసలు కారణం, ఆమెంటే తనకెంత ప్రేమో ఆరాధనో, తానెందుకు తనువు చాలించుకుంటున్నారో వ్రాశారు. ఆస్తుల వివరాలు సలహాలు, అనుభవాలు, శుభాకాంక్షలు కూడా రాశారు.

పాపుగంట తరువాత రాయటం పూర్తి చేసి మూడు కవర్లలో వాటిని పెట్టి భద్రంగా అతికించిన పైన వాళ్ళ వాళ్ళ అడ్రస్‌లు వ్రాశారు. వాటిని టేబుల్ పైన కనిపించేలా పెట్టి వెళ్ళి నిద్రమాత్రలు సీసా తెచ్చుకుని ఆ ఉత్తరాల పక్కనే ఉంచారు. ఆపైన ఏదో గుర్తుచేసుకుంటున్నవాడిలా పచార్లు వేస్తూ కిటికీ వద్దకు వచ్చి బయటకు

చూస్తూ అలానించుడిపోయారు. ఇప్పుడాయన చేయబోయేపని పట్ల సందేహంగాని, శంకగాని లేవు. కానీ ఆయన ఆలోచిస్తున్నది చివరిగా చేయవలసిన పనులు ఏమైనా మిగిలి ఉన్నాయా అని మాత్రమే.

అప్పుడే తెల్లవారింది. పగటి కాంతి అంతటి ముసురులోనూ పలచపలచగా పరుచుకుంది. తూర్పు వైపున మబ్బులకు, ముసురుకు భయపడిన సూర్యుడు బైటపడాలని ప్రయత్నించి విఫలుడై దానికి సాక్ష్యంగా మబ్బులకు ఎర్రజరీ వేస్తున్నాడు.

గజపతిరావుకి ఆవిధంగా కిటికీ వద్ద నించున్నప్పుడు కనిపించింది దూరంగా ఉన్న మట్టిరోడ్డు. ఆ ఊరికి అదే రహదారి. ఎవరన్నా వచ్చినా వెళ్ళినా అదే రహదారి. పిల్లల్ని అత్తవారింటికి పంపింది ఆ త్రోవనే. భార్యను కాటికి పంపింది ఆత్రోవనే. రేపు తన అంతిమ యాత్ర కూడా...

ఒక్కసారి అటెళ్ళి ఆ పరిసరాల్ని, ఆరోడ్డునీ, ఆ మనుషుల్నీ, ఇన్నేళ్ళు తన ఉనికిని భరించిన ఆ ఊరిని ఒక్కసాని చూసి వస్తే?

తనలో జనించిన ఈ అంతిమ కోర్కెలో ఎంతో అర్థం ఉందని చివరి క్షణంలో చిన్న కోర్కెని కాదనుకుని ఎందుకు మూర్ఖంగా, అసంతృప్తిగా చావాలనిపించి కదిలి బయటకు వచ్చి ఇంటికి తాళం వేశారు. అలా తాళం బిగిస్తున్నప్పుడు ఆయనకు నవ్వు వచ్చింది.

'మనిషికి ఎంత కాసీనం? ఎదుటి వ్యక్తిపైన ఎంత అపనమ్మకం? కన్ను మూయబోతూ కూడా స్వార్థాన్ని జయించలేని అసమర్థతే.'

ఆయన రోడ్డుమీద నడక ప్రారంభించాడు. అది చిన్న మట్టిరోడ్డు. అక్కడినుంచి పది నిమిషాలు నడిస్తేగాని ఆ ఊరికి పెద్దదైన రోడ్డు రాదు. ఆ మధ్యలో రెండు వైపులా పూరిళ్ళు. గుడిసెలు, పెంకుటిళ్ళు, అప్పుడప్పుడే తలెత్తుతున్న డాబా ఇళ్ళు... అన్నీ కలిసిపోయి వరుసగా ఉండడం చూస్తే కొత్తవాళ్ళకి ఆ ఊరి జనానికి స్వరాజ్యం వచ్చినట్లు వర్గ సమాజాలు ఏర్పడినట్లు తెలియదు కాబోలు అందుకే కలివిడిగా కలిసి మెలిసి బతుకుతున్నారు అనిపిస్తుంది.

రాత్రంతా వర్షం ఏకధాటిగా కురియడం చేత రోడ్లు బురదగానూ, ఇళ్ళ చూరుల్లోంచి, చెట్లపైనుంచి నీళ్ళు చుక్కలు చుక్కలుగా పడుతున్నాయి. పచ్చటి చెట్లు వాన నీటిలో తడిచి, పవిత్రంగా అగ్నిప్రవేశం చేయబోతున్న సీతలా ఉన్నాయి.

ఆయన తాపీగా నడుస్తున్నాడు. కంటికి కనిపించిన ప్రతి చిన్న వస్తువును, దృశ్యాన్నీ, మనుష్యులీన నిశితంగా, ఆప్యాయంగా పరీక్షగా చూస్తున్నాడు. మొదటిసారి ఆ ఊరు వచ్చినవాడిలా అన్నిటినీ చివరిసారిగా చూస్తూ మెల్లిగా నడుస్తున్నారు.

తాను చనిపోయినట్లు తెలిసి వీళ్ళంతా ఎలా రియాక్ట్ అవుతారు? అయ్యో పొద్దున్నే కూడా చూశామండీ. అని చెప్పుకుంటారా? ఏమో తను పోయాక ఏమౌతుందో తను ఎలా ఊహించగలడు?

ఆయన ఆలోచిస్తూనే ఆ ఊరి కోవెలను దాటి కాస్త ముందుకొచ్చారు. కోవెల మండపంలో నలుగురు వ్యక్తులు గోనెసంచిని నెత్తిమీద కప్పుకుని చుట్టలు తాగుతూ ఏదో విషయాన్ని దీర్ఘంగా చర్చించుకుంటున్నారు. కోవెల దాటగానే కాస్త దూరంలో వరుసగా గుడిసెలున్నాయి. ఆ గుడిసెల్లోంచి తెల్లటి పొగ పైకి లేస్తూ నల్లని ఆకాశంవైపు వెళ్తుంటే చూడడానికి చిత్రంగా ఉంది. మతకల్లోంతో అట్టుడికిపోతున్న నగరానికి వెళుతున్న శాంతికాముకుల బృందంలా ఉంది. గజపతిరావుగారు ఒక్క క్షణం ఆగి ఆ దృశ్యాన్ని విచిత్రంగా చూశారు.

అంతలో ఆయనకు వినిపించింది  చిన్నపిల్లాడి ఏడుపు. అడ్డూ, ఆపూ లేకుండా అదేపనిగా ఏడుస్తున్నాడు. సహజంగా పిల్లవాడి ఏడుపు వెనుకనే వినిపించే తల్లి జోలపాటగానీ లాలింపుగానీ వినరావడంలేదు.

ఆయన కదిలి ఏడుపు వినిపిస్తున్న వైపుగా వెళ్ళాడు. ఆ క్షణంలో ఆయనకు మహాలక్ష్మి గుర్తుకువచ్చింది. ఆమె కూడా పిల్లవాడు ఏడుస్తున్నా తనకేమీ పట్టనట్లు అద్దం ముందర కూర్చుని ముస్తాబవుతూ ఉండేది. తనెళ్ళి ఆమెని మందలించి పిల్లవాడిని చేరదీసేవాడు. ఆయన వెళ్ళి ఆ గుడిసెముందు ఆగాడు. అది లేనివాళ్ళల్లో బీదవాడి గుడిసె, గత రాత్రి వర్షం చేత చూరుల్లోంచి, కప్పుల్లోంచి నీళ్ళు బొట్లు బొట్లుగా కారుతున్నాయి. అది పేడతో అలికిన నేలపై పడి పెద్ద మడుగులా మారుతున్నాయి.

ఆ పిల్లవాడు అక్కడే వసారాలో ఆ నీళ్ళమడుగుమధ్యన కూర్చుని ఏడుస్తున్నాడు. అతడికి ఐదేళ్ళ వయసు ఉంటుంది. వయసుకు తగ్గ అభివృద్ధి శరీరంలో కనిపంచడంలేదు. నల్లగా బంకమట్టితో చేసినట్లున్నాడు. కాళ్ళు, చేతులు సన్నగా, పుడకల్లా ఉన్నాయి. పొట్ట మాత్రం పెద్దగా, వికృతంగా ఉంది. దానిపైన కనిపిస్తున్న పచ్చటి నరాలు ప్రపంచ పటంలోని సరిహద్దు గీతల్లా ఉన్నాయి. వీటికి తోడు అతడికి గుండుగీయిచడంచేత వ్యధలకి, వ్యాధులకి వారసుడిలాగా ఉన్నాడు.

గజపతిరావుగారు చూపుల్ని ఏడుస్తున్న అతనిపైనుంచి లోనికి పోనిచ్చాడు. ఒక ఆడమనిషి ముప్ఫై అయిదేళ్ళుంటాయి. సన్నగా, నల్లగా, వాడిపోయిన మొహం, ఎండిపోయన గుండెలు రేగిపోయిన జుట్టు, ఆత్రం, ఆరాటాలూ, నిరాశలు నిండిన బ్రతుకు. అక్కడున్న పొయ్యిలో నిప్పురాజేయాలన్న ప్రయత్నంలో ఉంది.

గజపతిరావుగారు విస్మయంగా చూస్తూ అలాగే నిల్చున్నారు.

తల్లి ఆత్రాన్ని గమనించకుండా ఆ పిల్లాడు ఏడుస్తూనే ఉన్నాడు.

ఆమె తన తలని పూర్తిగా పొయ్యిలోకి నెట్టి మెడ నరాలు తెగేలా, దవడలు చచ్చుపడేలా ఊదుతోంది. కొద్ది క్షణాల తర్వాత ఆమె తలని పైకెత్తింది. ఆమె మొహంలో ఏదో నిరాశ, నిస్పృహ, తమపైన, తమ బ్రతుకుల పైన అసహ్యం.

'ఎదవ సచ్చినోడా– పుల్లలు తడిసి చచ్చినాయి, అంటుకుచావటంలేదు– ఏంచేసేది? అంది–

చూస్తున్న గజపతిరావుగారికి పరిస్థితి విశదం అయింది. అంతలో ఆమె వాకిట్లో నిల్చున్న ఆయనవైపు అనుమానంగా చూసింది. వెంటనే ఆయన రెండడుగులు ముందుకేసి 'చూడమ్మా–పాపం కట్టెపుల్లలు తడిసి పోయినట్లున్నాయి. అవస్థపడుతున్నావ్– ఎవరినన్నా నా వెంట పంపిస్తే పొడికట్టెలు ఇవ్వగలను' సంజాయిషీ ఇస్తున్నట్లుగా అన్నారాయన.

ఆమె పొయ్యి ముందు నుంచి లేచి వసారలోకొచ్చింది. ఏడుస్తున్న పిల్లవాడిని చేతుల్లోకి తీసుకుంది, పైనించి కారుతున్న నీళ్ళవల్ల వాడి తలస్నానం చేసినట్లుంది. తనపైటతో వాడి తలను తుడుస్తూ– 'అవునుబాబూ– యెదవ వర్షం గంజి కాచుకుందామన్నా యీల్లేకుండా పొయ్యింది. రాత్రినుంచి ప్రయత్నం చేస్తావుండా. అంటుకుసావందే– అసలే యీడికి వొల్లు బాగాలేదు అంది.

ఆయన ఆమె చేతుల్లోంచి పిల్లవాడిని చూస్తూ 'ఎవరన్నా వున్నారామ్మా' అనడిగారు లేరంటే ఏంచెయ్యాలా అని ఆలోచిస్తూ.

ఆమె బయటికొచ్చి రెండడుగులువేసి, ప్రక్క గుడిసెవైపు చూస్తూ, 'సామీ రేయ్ సామిగా' అంటూ పిల్చింది. ఆగుడిసెలోంచి పదేళ్ళపిల్లవాడు తల మాత్రం బయటకు పెట్టి ఏవిటన్నల్లుగా చూసేడు.

'అయ్య పుల్లలిస్తారంట– యెళ్ళి తీస్కరా మా అయ్యవి కదూ– వీడు ఆకల్తో సత్తావున్నాడు–' బ్రతిమాలుతున్నట్లుగా అంది.

ఆ కుర్రాడు కాస్సేపు గారాలు పోయి, చివరికి సరేనన్నట్లు బయల్దేరాడు. గజపతిరావుగారు అక్కడ్నించి కదుల్తూ, ఒకసారి ఆమె చేతుల్లో ఉన్న పిల్లవాడి వంక చూసేరు. వాడు ఏడవటానికి కూడా వోపికయిపోయినట్లు సన్నగా రాగం తీస్తూ, ఆమె

భుజంపై పడున్నాడు.

ఇంటివైపుగా నడుస్తున్నంతసేపు ఆ పిల్లవాడే కళ్ళముందు కనిపించసాగేడు. మనిషికి ప్రాథమికావసరం తిఁడి ఈ శరీరాన్ని నిలబెట్టుకోవడానికి, శిథిలంకాకుండా కాపాడుకోటానికి తిండి చాలా ముఖ్యం. ఆ తిండి కూడా లేకుండా అల్లాడే వాళ్ళ గురించి ఆలోచించే వాళ్ళెవరు. తనకి తింటానికుంది, వెచ్చగా ఉండటానికుంది కాని తను చచ్చిపోవాలనుకున్నాడు, కానీ ఏమీ లేని ఆ తల్లి తడికట్టెల్లోంచి నిప్పు పుట్టించాలని ఆరాటపడుతోందేకాని, పిరికితనంగా, తనలాగా చావాలనుకోలేదే!

గజపతిరావుగారు ఇంటికి సమీపించి, తలుపులు తెరిచి, వంట గదిలో వరుసగా పేర్చిన కట్టెపుల్లల్ని వెంట వచ్చిన కుర్రాడి రెండుచేతులపైన వేసేరు. ఎన్నివేస్తున్నాడో, వాటిని ఆ పిల్లవాడు మోయగలడో లేదోనన్న ఆలోచనే రాలేదాయనకి. తిరిగి తలుపు తాళం బిగిస్తూ, అక్కడ బల్లపై సగం తిని వదిలిన బ్రెడ్ పొట్లాన్ని కూడా చేతిలోకి తీసుకున్నారు.

ఇద్దరూ నడక ప్రారంభించేరు. ముందు ఆయన, వెనగ్గా కట్టెలు మోస్తూ ఆ కుర్రాడు. సగం దూరం నడిచి వెనక్కి తిరిగి చేసారు. ఆ కుర్రాడు ఆ బరువు

మొయ్యలేక అతికష్టం పైన మెల్లిగా నడుస్తున్నాడు.

గజపతిరావుగారు మళ్ళీ వెనక్కి వెళ్ళారు. ఆ కుర్రాడి ముందు మోకాళ్ళపై కూర్చుని అతడి చేతులపై ఉన్న ఆ కట్టెలన్నింటిని తన చేతులపైకి మార్చుకున్నారు. అలా మార్చుకున్నప్పుడు బట్టలు బురద అవుతాయన్న ధ్యాసేలేదు. తన చేతిలో ఉన్న బ్రెడ్ ప్యాకెట్ అతడికిచ్చాడు.

మళ్ళీ నడక–

అయిదు నిమిషాల్లో ఆ పాకని సమీపించారు. తన చేతులపై ఉన్న కట్టెల్ని జాగ్రత్తగా అక్కడుంచారు. 'అయ్యో మీరు మోసుకోచ్చారా? ఆ సచ్చినోడేడి? అందామె నొచ్చుకుంటున్నట్లు. ఇందాక పోరు పెట్టి ఏడ్చిన ఆ పిల్లాడు అక్కడి తడినేలపై ఆయాసపడుతున్నట్లు రొప్పుతున్నాడు.

మళ్ళీ సన్నగా వర్షం మొదలైంది. ఆమె కట్టెలను పొయ్యిలో సర్దుతూ ఆయన వంక కృతజ్ఞతాపూర్వకంగా చూసింది. ఆమె మొహంలో ఏదో ఆనందం. గజపతిరావుగారికి ఆ కుర్రవాడికి ఇచ్చిన పొట్లాం సంగతి గుర్తుకొచ్చింది. ఇక్కడ సోషగా పడివున్న ఈ పసివాడికి ఇవ్వాలని ఆయన ఉద్దేశ్యం, బయటకు వచ్చి సామిగాడికోసం చుట్టూ చూశారు. వాడు దూరంగా చెట్టుకింద నిలబడి ఆ రొట్టెని ఆత్రంగా పీక్కుతింటం ఆయన కళ్ళపడింది.

ఆ క్షణంలో వాడిమీద కోపం రాలేదుకాని అర్థంకాని సిద్దాంతం అవగతమైనట్టు అనిపించింది, డబ్బు, బలం, పలుకుబడి ఉన్నవాడిదే బతుకు, అవిలేనివాళ్ల జీవితాలు పెద్ద శాపాలు.

మరొక్కసారి అక్కడ జడపదార్థంలా పడివున్న ఆ పిల్లవాడ్ని ఆర్తిగా, ఆర్ద్రంగా చూసి వెనక్కి తిరిగాడు. వర్షం జల్లు పెద్దదైంది. తాళం తీసి ఇంట్లోకి ప్రవేశించగానే ఆయనకి కనిపించనవి ఉత్తరాలు, నిద్రమాత్ర సీసా.

కానీ విచిత్రంగా ఇప్పుడాయనలో చచ్చిపోవడంలో ఇందాక ఉన్న ఉత్సాహం లేదు. తిరిగి బతుకుపైన ఆశపుట్టింది. తన వల్ల ఎవరికీ ఉపయోగం లేదనడంలో అర్థంలేదనిపించింది. ఇన్నేళ్ళుగా జీవంలేని ఈ ఫోటోని నమ్ముకుని మనసుని, బుద్దిని రాయి చేసుకున్నాడు. తన చూపుని ఫోటోలోంచి ప్రకృతిని తిప్పితే సజీవమైన ప్రపంచం ఉంది. నిర్భగ్యులైన ప్రజలున్నారు. వాళ్ళకెన్నో సమస్యలున్నాయి. వాళ్ళ కష్టాలనీ, జీవితాలనీ తను పంచుకుంటే–?

దూరంగా ఎక్కడో ఉరిమింది.

గజపతిరావుగారు ఏదో నిర్ణయిచుకున్న వాడిలా అక్కడున్న ఉత్తరాల్ని పరపరా చించేసి చిన్న ముక్కలుగా చేసి లేచి వెళ్ళి వాటిని కిటికీలోంచి వాననీటిలోకి విసిరేశారు. చాలా సంవత్సరాల తర్వాత ఆయన నవ్వారు–